క్లుప్తంగా

ప్లాస్టిక్ వ్యర్థాలు విక్రయిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్

మెట్‌పల్లి: పట్టణంలో ఇళ్ల నుంచి సేకరిస్తున్న పొడి చెత్తను సిబ్బంది వనరుల కేంద్రానికి తరలించాలని కమిషనర్ మోహన్ సూచించారు. మంగళవారం కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతీ రోజు కేంద్రానికి వస్తున్న పొడి చెత్తకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ సిబ్బంది పొడి చెత్తను బయట అమ్ముకోకుండా వనరుల కేంద్రానికి తరలించేలా శానిటేషన్ విభాగం అధికారులు చూడాలన్నారు. ఆయన వెంట డీఈఈ నాగేశ్వర్‌రావు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విష్ణు, ముజీబ్ తదితరులున్నారు.

యూనిఫామ్స్ సకాలంలో అందించాలి



దుస్తుల తయారీని పరిశీలిస్తున్న ఏపీఎం

జగిత్యాలరూరల్: విద్యార్థుల యూనిఫామ్స్ సకాలంలో అందించాలని జగిత్యాల ఏపీఎం గంగాధర్ అన్నారు. మంగళవారం జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ తయారీ యూనిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యులతో దుస్తులు కుట్టిస్తున్నట్లు తెలిపారు. జగిత్యాల రూరల్ మండలంలో 3567 జతలు, జగిత్యాల అర్బన్ మండలంలో 553 జతలు కుట్టిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లాకు చెందిన ఏపీఎం సుభాష్ చంద్రబోస్, సీసీ విద్యాసాగర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు గంగభవాని, వీవోఏ విజయ, సభ్యురాలు సంగీత తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పాం సాగుపై అవగాహన



ఆయిల్ పాం సాగుపై వివరిస్తున్న అధికారులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పాం పంట సాగుపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయిల్ పాం మొక్కలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగు చేస్తే నాలుగేళ్ల నుంచి 30 ఏళ్ల వరకు రైతులకు ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో హరీశ్, ఆయిల్ పాం మండలాధికారి శ్రావణ్, మార్కెట్ డైరెక్టర్ వాకిటి రాజారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో అందించాలి

మెట్‌పల్లి: వేతనాలు సకాలంలో అందించాలని మున్సిపల్ కార్మికులు మంగళవారం కమిషనర్ మోహన్‌కు వినతిపత్రం అందించారు. వేతనాల చెల్లింపుల్లో జాప్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రతీ నెల రెండో తేదీన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే నెల నుంచి దీనిని అమలు చేయాలని, లేని పక్షంలో మూడో తేదీ నుంచి సమ్మె చేపడతామని తెలిపారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	02	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	10	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	02	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	01	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	01	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	05	560
నందీశ్వర సూట్స్	02	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	14	448
పార్వతీపురం స్పెషల్	15	672
పార్వతీపురం సాధారణ	16	336

- వేములవాడ

నిధులు రావు.. పనులు కదలవు



కంకర వేసి వదిలేసిన రోడ్డు



ప్రమాదకరంగా సంగెం కల్వర్టు

- బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.30 కోట్లు మంజూరు
- నిధులు రాక పనులు ప్రారంభించి వదిలేసిన వైనం
- రెండేళ్లుగా ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులు

కోరుట్ల రూరల్: కోరుట్ల పట్టణ శివారు జంబి గద్దె నుంచి సంగెం మీదుగా నాగులపేట వరకూ బీటీ రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం పంచాయతీరాజ్ నిధులు రూ.1.30 కోట్లు మంజూరయ్యాయి. దీనిలో భాగంగా మూడు కల్వర్టులు, సంగెం గ్రామంలో సీసీరోడ్డు వేయడం, మిగతా రోడ్డు బీటీ రోడ్డుగా వేసేందుకు నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సంగెం నుంచి నాగులపేట వరకు కంకర పనులు ప్రారంభించారు. కానీ నిధుల విడుదలలో జాప్యం కారణంతో పనులు ముందుకు సాగలేదు. దీంతో రెండేళ్లుగా కంకర రోడ్డుపై ప్రయాణం ఇబ్బందిగా మారింది.

విద్యార్థుల అవస్థలు..

సంగెం నుంచి విద్యార్థులు ఇదే రోడ్డుపై నాగులపేట హైస్కూల్‌కు వెళ్తుంటారు. కంకర రోడ్డు కారణంగా కాలినడకన, సైకిల్‌పై వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ద్విచక్ర వాహనదారులు కూడా తమ వాహనాలు పాడవుతున్నాయని పేర్కొంటున్నారు. సంగెం పక్కనే ఓ కల్వర్టు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. కేజీవీల్ ట్రాక్టర్లతో రోడ్డు పూర్తిగా పాడై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి నిధులు విడుదల చేయించి రోడ్డు పనులు పూర్తయ్యేలా కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిధులు విడుదల కాక పనులు ఆపేశారు

బీటీ రోడ్డుకు నిధులు మంజూరైనప్పటికీ నిధులు విడుదలలో జాప్యం కారణంగా కాంట్రాక్టర్ సంగెం నుంచి నాగులపేట వరకూ కంకర మాత్రమే వేసి పనులు ఆపేశాడు. నిధులు విడుదలవుతేనే పనులు నడుస్తాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధుల విడుదలకు కృషి చేస్తాం. – సుచిత్ రావు, పీఆర్ ఏఈ



కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం శివారులోని రామస్వామి ఆలయం ముందర వ్యవసాయ పంపు సెట్లకు వెళ్లే 11 కేవీ విద్యుత్ లైన్ స్తంభం గత కొన్ని నెలల క్రితం విరిగింది. కాగా విరిగిన స్తంభం మార్చేందుకు నెల రోజుల క్రితం కొత్త స్తంభం వేసి ఉంచారు. ఇప్పటి వరకూ కనెక్షన్ ఇవ్వలేదు. బలమైన ఈదురు గాలులకు స్తంభం విరిగి పడే ప్రమాదం ఉందని కొత్త స్తంభానికి కనెక్షన్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: భూక్య శ్రీనివాస్ నాయక్
ట్రాన్స్‌కో రూరల్ ఏఈ, కోరుట్ల, సెల్ నంబర్: 9440811477

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: తడి, పొడి చెత్త, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ బీఎస్.లత అన్నారు. మంగళవారం పారిశుధ్యంపై ఆర్పీలు, వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం చాలా ముఖ్యమని, ప్రతి ఇంటి నుంచి తడి, పొడిచెత్త వేరుగా సేకరించాలని, ప్లాస్టిక్ నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. వేసవికాలం దృష్ట్యా పట్టణం, వార్డుల్లో మొక్కలను సంరక్షించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అర్బన్ హౌసింగ్ కాలనీ డబుల్‌బెడ్‌రూంలలో మౌలిక వసతులు పూర్తయ్యాయని, లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లలో ఉండేలా చొరవ చూడాలన్నారు. ర్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, డీఈ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మట్టి కుప్పలు.. ప్రజల తిప్పలు



వెల్గొండలోని ఓ కాలనీలో మొరం కుప్పలు

బుగ్గారం: మండలంలోని వెల్గొండలో ప్రభుత్వ పాఠశాల సమీపంలోని రోడ్డులో సీసీ రోడ్డు పక్కన గుంతలు పూడ్చడానికి, దారిని లెవల్ చేయడానికి మొరం కుప్పలు పోశారు.అయితే ఈ మొరంను రోజులు గడుస్తున్నా అలాగే వదిలేయడంతో ఆ కాలనీ వాసులు తమ ఇళ్ల నుంచి బయటకి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల ముందే మట్టికుప్పలు ఉండడంతో రాకపోకలు సాగించే క్రమంలో పలువురు వృద్ధులు, పిల్లలు కిందపడి గాయాలపాలవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లెవల్ చేయడానికి అవసరమైన మొరానికయ్యే ఖర్చును స్థానికులే భరించాలని పనులు నిర్వహించేవారు అంటున్నారని, ప్రస్తుతం రోడ్డుపై పోసిన మొరంకు అవసరమయ్యే డబ్బులను కాలనీ వాసులు చెల్లిస్తేనే కుప్పలను చదును చేస్తామని అంటున్నారని స్థానికులు వాపోతున్నారు. గతంలో గ్రామంలోని పలు చోట్ల సీసీరోడ్లు వేయడానికి ముందు అవసరమయ్యే మొరం ఖర్చును స్థానికులే భరించారని, మీరు సైతం డబ్బులను ఇవ్వాల్సిందేనని అంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి: మండలంలోని నర్సింహునిపేటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు, ఆస్తి నష్టం వాటిల్లిన బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రెండు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు, ఇంట్లోని సామగ్రి దగ్ధమై నష్టపోయిన ఆరెల్లి దుర్గయ్య కుటుంబాన్ని మంగళవారం రాత్రి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. ఇందిరమ్మ ఇల్లు, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

లక్ష్మణ్‌కుమార్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నరేశ్

జగిత్యాల: ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నరేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తీసిన జనాభా లెక్కల ప్రకారం మాదిగలు 11 శాతం ఉన్నారని తేలిందని, 5 శాతం మాలలు ఉంటే భట్టి విక్రమార్కకు ఇవ్వడం జరిగిందని, ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా ఎన్నో సేవలందించారన్నారు. కార్యక్రమంలో రామిల్ల లక్ష్మణ్, లింగంపల్లి లక్ష్మణ్, చంద్రయ్య, లచ్చయ్య, మోహన్, గంగయ్య, రాజేశం, లింగయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యువత ప్రణాళికతో చదివి లక్ష్యాన్ని సాధించాలి

జగిత్యాలక్రైం: యువత ప్రణాళికతో చదివి లక్ష్యాన్ని సాధించాలని పట్టణ సీఐ వేణుగోపాల్ అన్నారు. పట్టణంలోని ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న పోలీస్ డిఫెన్స్ పరీక్షల ఉచిత శిక్షణ కార్యక్రమంలో డైరెక్టర్ ముద్రబోయిన రాజు ఆధ్వర్యంలో కార్యక్రమానికి హాజరైన సీఐ మాట్లాడుతూ దేశ రక్షణ రంగంలో ఉద్యోగాలు చేయుటకు ముందుకు వచ్చేలా ఎర్త్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ ఉచిత శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అబాకస్ నిపుణులు గంగాధర్ మాట్లాడుతూ యువత కోసం ఆర్మీ శిక్షణ ఇవ్వడం ఎంతో శుభపరిణామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మంగళపల్లి రాజు, సీనియర్ కో-ఆర్డినేటర్ ఆంజనేయులు, స్పెక్ట్రమ్ ఇనిస్టిట్యూట్ ఎండీ నాగరాజు, ట్రైనర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం ధర్మారంలో మంగళవారం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. వాతావరణంలో వచ్చిన మార్పుల దృష్ట్యా కొనుగోళ్లు వేగవంతం చేయాలని, హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాజేశ్, నిర్వాహకులు జ్ఞానేశ్వర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

తేమశాతం వచ్చిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

ఇబ్రహీంపట్నం: తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్రాలలో సిబ్బందికి తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని మూలరాంపూర్, ఎర్దండి, కోజన్‌కొత్తూర్, కేశాపూర్, ఇబ్రహీంపట్నం కొనుగోలు కేంద్రాలను సందర్శించి మ్యాచర్ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు రైతులు ఎంత మంది ధాన్యం పోశారు, ఎన్ని లారీలను మిల్లులకు తరలించారు మొదలైన వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో కార్యదర్శి మంత్రి సతీశ్, సిబ్బంది రాము, రాజేశ్, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో ఇబ్బందులపై ఫిర్యాదు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి, లచ్చునాయక్‌తండా గ్రామాల్లో ఐకేపీ (సెర్ప్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇబ్బందులు పడుతున్నామని రైతులు మంగళవారం మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన రైతు బొడిగం తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రిని కలిసిన రైతులు కేంద్రంలో ధాన్యంలో తాలు తప్ప లేకుండా యంత్రాలతో శుభ్రం చేయాలనుకున్నా యంత్రాలు పనిచేయడం లేదని నిర్వాహకులు పేర్కొంటున్నారని తెలిపారు. దీంతో రైతులు ధాన్యం పట్టకుండా ప్రతీ సంచికి 2 కిలోల అదనపు తూకంతో 42 కిలోల 200 గ్రాముల తో తూకం వేస్తున్నారని, దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి డీఆర్‌డీవో పీడీతో మాట్లాడి తక్షణమే విచారణ జరిపి, రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.దీనిపై చర్యలు తీసుకుంటామని పీడీ హామీ ఇచ్చినట్లు జీవన్‌రెడ్డి రైతులకు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ధర్మపురి: మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్ ఇటీవల దుబాయిలో హత్యకు గురికాగా, బాధిత కుటుంబానికి హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో రూ. 57 వేలు జమచేసి మంగళవారం అందజేశారు. మృతుడి తల్లి రాజవ్వ పేరు మీద బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు గాజు భాస్కర్, ధర్మపురి, దమ్మన్నపేట హిందూ ఐక్యవేదిక సభ్యులున్నారు.


పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

కోరుట్ల రూరల్: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను పారదర్శంగా ఎంపిక చేస్తామని ఎంపీడీవో రామకృష్ణా అన్నారు. మండలంలోని గుమ్లాపూర్‌లో ఇందిరమ్మ కమిటీ ఎంపిక చేసిన జాబితాపై ఎంపీడీవో రామకృష్ణా మంగళవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్, కారోబార్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ జాతర ఆదాయం రూ. 50,223

మెట్‌పల్లిరూరల్: మండలంలోని వెల్లుల్ల ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం జరిగిన జాతర సందర్భంగా రూ.50,223 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ పరిశీలకుడు సురేందర్ తెలిపారు. సేవా టిక్కెట్ల ద్వారా రూ.40,070, హుండీ ద్వారా రూ.10,153 ఆదాయంతో పాటు ఐదు గ్రాముల వెండి వచ్చిందన్నారు. ప్రతీ వారం జరిగే జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కల్వకుంట్ల అనిల్‌రావు, కూకట్ల రాజేందర్, నర్సయ్య, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న డీఆర్డీవో

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీవో రఘువరన్ మంగళవారం పరిశీలించారు. ఈ నెల 29న సాక్షి దినపత్రికలో 'హమాలీలు లేక నిలిచిన కొనుగోళ్లు' అనే వార్తా ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. డీఆర్డీవో రఘువరన్, తహసీల్దార్ వినోద్, ఏపీఎం నరహరి కొనుగోలు కేంద్రానికి చేరుకుని నిర్వాహకులతో మాట్లాడారు. ఇతర గ్రామాల నుంచి హమాలీలను తెప్పించి తూకం వేయించాలని ఆదేశించారు. కొనుగోళ్లు జాప్యం చేయవద్దన్నారు.

సాక్షి స్పందన



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

జగిత్యాల: విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. మంగళవారం కళాశాలలో జోష్ 2కే25 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మంచి ప్రణాళిక, నిరంతర శ్రమ, కృషి అంకితభావంతో చదివితే ఉన్నతస్థాయికి వెళ్లవచ్చన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రమోద్‌కుమార్, చంద్రయ్య, వరప్రసాద్, ఎంఏ.రహీం, సంగీతరాణి, వాసవి, నీరజ, మల్లికార్జున, జమున పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే ఉన్నత శిఖరాలకు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

కోరుట్ల: నిరంతర సాధనతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సీఐ సురేశ్ బాబు అన్నారు. పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఫేర్‌వెల్ వేడుకలకు సీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ హరిప్రియ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడి మృతులకు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

కరీంనగర్: పహల్గాం ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మంగళవారం శ్రీవేంకటేశ్వరకాలనీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.కార్యక్రమంలో సొసైటీ నాయకులు దేవేందర్ రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

జగిత్యాల: పాడిరైతులు గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్ అన్నారు. మంగళవారం జగిత్యాలలోని వంజరిపల్లిలో 25 తెల్లజాతి పశువులకు, 208 గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. రైతులు తప్పకుండా పశువులకు టీకాలు వేయించాలన్నారు.

ఇప్పపెల్లిలో బడిబాట

కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లిలో మంగళవారం ముందస్తుగా బడిబాట చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా విద్య, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్స్ అందిస్తున్నామని ఉపాధ్యాయులు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పరుశురాం, సీఆర్‌పీలు కృష్ణప్రసాద్, హన్మాండ్లు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మల్యాల: మండలంలోని తాటిపల్లికి చెందిన అట్ల రవీందర్ రెడ్డి (45)తన వ్యవసాయ పొలం వద్ద ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం అనారోగ్యంతో బాధపడుతున్న రవీందర్‌రెడ్డి మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమీప బంధువుకు ఫోన్‌లో చెప్పి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

కథలాపూర్‌లో ఒకరు..

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లికి చెందిన బైకం గంగారాం(60) మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గంగారాం గత కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకున్నా నయం కాలేదన్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం గ్రామ శివారులో వరదకాలువ సమీపంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.